Eenadu Date :- 17/08/2023

# విమానాశ్రయ మెట్రోకి గ్లోబల్ టెండర్లు

- నోటిఫికేషన్ జారీ చేసిన హెచ్ఏఎంఎల్
- ప్రాజెక్టు అంచనా విలువ రూ.5,688 కోట్లు
- బిడ్ దాఖలుకు జులై 5 వరకు గడువు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న విమానాశ్రయ మెట్రో ప్రాజెక్టులో మరో ముందడుగు పడింది. గ్లోబల్ టెండర్లను ఆహ్వానిస్తూ హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రోరైలు లిమిటెడ్(హెచ్ఏఎంఎల్) మంగళవారం బిడ్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్(ఈపీసీ) విధానంలో గుత్తేదారును ఎంపిక చేయడానికి టెండర్లు పిలిచారు. ప్రాజెక్టు అంచనా విలువ రూ.5,688 కోట్లుగా నిర్ధారించారు. ఇందులో ఎలివేటెడ్, భూగర్భ స్టేషన్ల నిర్మాణం, వయాడక్ట్, ట్రాక్ వంటి సివిల్ పనులతోపాటు ఎలక్ట్రికల్, మెకానికల్ పనులు, మెట్రో రైళ్లు, సిగ్నలింగ్, టెలికమ్యూనికేషన్లు, విద్యుత్తు సరఫరా, రైలు నియంత్రణ వ్యవస్థలు, ఆటోమేటిక్ ఫేర్ కలెక్షన్ తదితరాలన్నీ ఉన్నాయి. టెండరు దక్కించుకున్న సంస్థ ప్రాజెక్టును మూడేళ్లలో పూర్తి చేయాల్సి ఉంటుంది. టెండరు దాఖలుకు తుది గడువు జులై 5గా నిర్ణయించారు. బుధవారం నుంచి టెండరు దరఖాస్తుల జారీ ప్రక్రియ మొదలవుతుందని హెచ్ఏఎంఎల్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి తెలిపారు.




రాయదుర్గం వద్ద ఎక్స్‌ప్రెస్ మెట్రోని సూచించే పెగ్ మార్కింగ్

## తొమ్మిది స్టేషన్లు... భవిష్యత్తులో మరో నాలుగు

రాయదుర్గం నుంచి శంషాబాద్ విమానాశ్రయం వరకు ఎయిర్‌పోర్ట్ ఎక్స్‌ప్రెస్ మెట్రోని సొంత నిధులతో చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. 31 కి.మీ. ప్రతిపాదిత మార్గంలో 29.3 కి.మీ. ఆకాశమార్గం(ఎలివేటెడ్), విమానాశ్రయంలో 1.7 కి.మీ. భూగర్భమార్గంలో మెట్రో ఉంటుంది. ఈ మార్గంలో ఒక భూగర్భ మెట్రోస్టేషన్‌తో సహా తొమ్మిది స్టేషన్లు ఉంటాయని, భవిష్యత్తు అవసరాల దృష్ట్యా అవసరమైన చోట నాలుగు అదనపు స్టేషన్ల నిర్మాణానికి తగిన ప్రణాళికలు సిద్ధం చేశామని హెచ్ఏఎంఎల్ ఎండీ తెలిపారు. ప్రస్తుతం భూసామర్థ్య పరీక్షలు వేగంగా జరుగుతున్నాయని వివరించారు.

## వ్యయం ఎందుకు తగ్గింది?

విమానాశ్రయ మెట్రోకి 2022 డిసెంబరులో సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేశారు. అప్పుడు ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.6,250 కోట్లుగా ప్రభుత్వం తెలిపింది. టెండరు నోటిఫికేషన్‌లో అంచనా వ్యయం రూ.5,688 కోట్లుగా హెచ్ఏఎంఎల్ పేర్కొంది. అంటే రూ.562 కోట్లు తగ్గింది. దీనిపై ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి వివరణ ఇస్తూ... ప్రాజెక్టు వ్యయంలో ప్రభుత్వ పరిధిలోని జనరల్ ఇంజినీరింగ్ కన్సల్టెన్సీ వ్యయం, ఆకస్మిక పరిస్థితులు, బహుళ మోడల్ ఇంటిగ్రేషన్‌కు అయ్యే ఖర్చు తదితర అంశాలు కలిసి ఉంటాయని.. టెండరులో ఇవి లేకపోవడంతోనే అంచనా వ్యయం తగ్గిందన్నారు.